# శతవృద్ధు

ఆయన మళ్ళీ సరిగ్గా అదే సమయానికి అక్కడ కనబడ్డాడు!

ఆయన చుట్టూతా పదిమంది చిన్నపిల్లలు, అల్లరిచేస్తూ కొందరు, నవ్వుతూ గెంతుతూ కొందరు; గులకరాళ్ళు కాలవలోకి విసిరివేస్తూ మరికొందరు.

ఓ కుర్రవాడు కొంటెగా అడుగుతున్నాడు. "తాతా!—నీ వయసెంత!"

"ఆఁ! ఎంతరా?—రేపు శ్రావణ మాసానికి పదమూడేళ్ళు." ఆయన బోసినోట్లో మాట వంకర్లు తిరిగింది.

చమత్కారం మాటవిని తలపైకెత్తి చూశాను. సాయంకాలపు నీరెండ ఆయన బట్టతలపైబడి సిగ్గుతో ప్రక్కకు జారిపోతోంది. శరీరం ముడుతలుపడి, ముడుతలమధ్య శరీరపు ఎర్రదనం చిక్కబడుతోంది. వెడల్పు పెదిమలు. నొసటన గంధాక్షతలు. ఆయన చేతిలో కర్ర గాలికి వణుకుతున్నది.

నేనా వూరికి క్రొత్త. జనాభా లెక్కల ఆఫీసరుగావచ్చి, ఊరికి దూరంగావున్న కాలనీలో వో ఇల్లు అద్దెకు తీసుకున్నాను. ఎవరూ ఇంకా పరిచయం కాలేదు. సాయంకాలం పూట కృష్ణకాల్వ, ఉదయంపూట ఇంట్లో శ్రీమతీ మాత్రమే నన్ను చనువుగా పల్కరించే నా వాళ్ళు.

వచ్చినప్పటి నుంచీ, ప్రతిసాయంత్రం, అక్కడే కూచుంటున్నాను. నా చుట్టూతా కంటికి ఆనందంగా నేల మీద తివాచీ పర్చినట్లున్న పేరు తెలీని పూలు.

నాకు కొంచెం దూరంలో ఆయన. ఆయన చుట్టూతా పేరుతెలీని పూల వంటి అల్లరి పసిపిల్లలు.

"తాతా! నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకోరాదూ?"

"ఒరేయ్! ఇక్కడెవరూ అందమైన ఆడపిల్లల్లేర్రా! – మీ బామ్మ వెళ్ళింది పైనెవరన్నా వున్నారేమో కనుక్కొస్తానని. ఇంకా ఉత్తరం రాలేదు. రాగానే, నేనే అక్కడకు వెళ్తాను–కొత్త పెళ్ళికొడుకున్నై."







"నువ్వెళ్ళేటప్పుడు నన్ను తీసుకెళ్ళవూ?"

ఆయన వంగాడు, ఆ పసిదాన్ని ముద్దుపెట్టుకుందామని. చెవులమధ్య నిలువని కళ్ళజోడు, ముక్కుమీదకు జారి క్రింద పడిపోయింది. తాతకు కళ్ళజోడు దొరక్కుండా చేద్దామని ఆ పిల్లలు "దొంగాట" ఆడడం మొదలెట్టారు. "ఇయ్యండర్రా! కళ్ళు కనుపించవ్" అంటున్నాడాయన దీనంగా. నా కేదిటో అది బాధ అనిపించింది. పండిన పండు ఆ మనిషి. ఎప్పుడో రాలిపోతుంది. దాన్ని మనం బంతిలా ఆటలాడకూడదు. లేచి వెళ్ళి, ఓ పిల్ల తన చేతిలో వెనగ్గా దాచుకొన్న ఆ కళ్ళజోడును గభాలున లాక్కుని "ఇదిగోనండీ!" అన్నాను—మర్యాదనంతా కంఠంలోకి తెచ్చుకుంటూ.

ఆయన ఉలిక్కి పడ్డాడు. కళ్ళజోడు పోగొట్టుకున్న ఆ పిల్ల నావేపు కోపంగా చూస్తున్నది.

"థ్యాంక్స్!" అని ఆయన నానుండి ఆజోడు నందుకుని "ఏం తల్లీ?—కోపం వచ్చిందా?— ఇదిగోనమ్మా జోడు—తీసుకో" అంటూ మళ్ళీ ఆ అమ్మాయికే ఇయ్యబోయాడు.

"జోడు లేకపోతే మీకు కష్టం కాదా?"

ఆయన నవ్వాడు. "నిజంగా నాకు 'సైట్' వుందను కొంటున్నారా?" అన్నాడు. "ఈపిల్లలకు నేను జోడు లేకపోతే గ్రుడ్డివాణ్ణయితే, అదో తమాషా, అదో ఆట. వాళ్ళ ఆనందాన్ని నేనెందుకు పాడుచేయాలి?—నాసేవు నాకు కళ్ళు కనిపించకపోతే ఏం?"

నేను మాట్లాడకుండా నుంచోవడం చూసి మళ్ళీ ఆయనే అన్నాడు. "చూశారా—నా చాదస్తం? ఎంతసేపటికి నన్ను గూర్చే మాట్లాడు కొంటున్నాను కాని, మిమ్మల్ని గూర్చి తెలుసుకోలేదు."

ఆయన ఆయాసంతో ఆగాడు. "పెద్దవాణ్ణి! మాట్లాడితే ఆయాసం వస్తుంది. నడుద్దామనీ, ఏదో ఒకపని చెయ్యాలనీ వుంటుంది. చెయ్యలేను."

ఆడుకొంటున్న పిల్లలు, నన్నో ఆటంకంగా భావించి, తమ విసుగుదలనంతా మొహాల్లో చూపిస్తున్నారు.

ఉన్నట్టుండి ఓపిల్లవాడు అన్నాడు "మనం వెళ్ళిపోదాం, రా తాతా! కథలు చెప్పుకుందాం."

ఆయన నవ్వి, "వీళ్ళే నాకు కాలక్షేపం" అని, "వస్తాను" అన్నట్టుగా తలవూపి, పిల్లలతో కలిసి నాలుగడుగులువేసి, మళ్ళీ జ్ఞాపకంవచ్చి ఆగి, "మర్చిపోయ్యాను, మీ పేరేమిటున్నారు?" అని అడిగాడు.

నా పేరుతో మాత్రమే ఆగక, అక్కణ్నుంచి నడిచి ఒక్కొక్క అడుగేవేస్తూ, నా ఉద్యోగం, పిల్లలూ అన్నీ వివరంగా అడిగి, "రేపు కలుద్దాంమళ్ళీ" అని వెళ్ళిపోయాడు.

ఆరాత్రి, భోజనాలదగ్గర, చారుమతి చెప్పింది "ఇది విన్నారా అని?"

అట్లా ప్రశ్నతో ప్రారంభిస్తే ఏదో పెద్ద విశేషమే వుందని నాకు అనుభవం నేర్పిన పాఠం. "ఏమిటి?" అన్నాను, అడగలేదన్న నెపం నామీద ఎందుకని. నాకు, ఆ ముసలాయనను గురించి చెప్పాలని ఎంతో ఉబలాటంగా వుంది.

"అదేనండీ! మన పొరుగింట్లో ఓ ముసలాయనున్నాడు."

"పొరుగింట్లోనే కాదు, ప్రతి ఇంట్లోను వుండొచ్చు."

"అబ్బ! అదికాదండీ! ఆయనకు తొంభై ఒక్క ఏళ్ళుట."

సాయంకాలం చూసిన ఆ ముసలాయన రూపం నాకు చటుక్కున జ్ఞాపకానికి వచ్చింది. ఆయనకెంత వయసు?—పదమూడుఏళ్ళు—మై గుడ్‌నెస్! సరిగ్గా తొంభై ఒకటి. ఆయనా, ఈయనా ఒకటి కావచ్చు. నాకు ఉత్సుకత ఎక్కువైంది. "అట్లాగా!" అన్నాను ఆత్రుతగా, ఆ తర్వాత చెప్పమన్నట్టు. చారుమతి ఒక్కసారి తన జడలో పువ్వులు సర్దుకొంది. మెళ్ళోవున్న గుళ్ళతాసులపేట సరిచేసుకుంది.

"ఆయన ఇంకా నడుస్తాట్టండీ! చూపు అనుతుందట! చెవులు వినబడతాయట. అన్నం అరుగుతుందట."

"పాపం, పళ్ళేలేవు."

"మీరు చూశారేమిటిఆయన్ను!" చారుమతి కళ్ళు చేపలే అయ్యాయి.

"చూడడమే కాదు, మాట్లాడాను కూడానూ."

చారుమతి మొహం 'మంచిపని చేశారు' అన్నట్టు, ఆనందంతో మందార పుష్పమే అయింది.

"మనింటి కోసారి తీసుకురారూ ఆయన్ను. నాకుచూడాలనివుందండీ." చారుమతి తండ్రి, ఆమె పదేళ్ళ వయసులో వుండగా పోయేడు. దాని మేనమామే దాన్ని పెంచి, నన్నో యింటివాణ్ణి చేశాడు. దానికి ముసలివాళ్ళన్నా, పిల్లలన్నా జాలీ-ప్రేమా అప్పట్నుంచి.

"అట్లాగే పిలుస్తానులే."

మా యింట్లో కూచుంటే, ఎదురింట్లో వారి వంటింటి గుమ్మంవరకూ కన్పిస్తాయి. ఆయన ఆ మర్నాడూ, ఆ తర్వాతా దూరదూరంగా కన్పించడమే తప్ప, దగ్గరకు రాలేదు. పిల్లలు రానిచ్చి వుండరు.

ఒకటి రెండుసార్లు, మా యింట్లో వుంటేనే, ఎదురింట్లోనుంచి పెద్దగా కేకలు విన్పించాయి.

"పెద్దవాడివైనావ్! ఇల్లు కదిలి వెళ్ళదంటే, విన్పించుకోవేం—ఏ బస్ కిందో పడితే అప్రతిష్ఠ మాకు!"

ఆవిడ కంఠంతో, చారుమతి కంఠాన్ని పోల్చుకుని, నా అదృష్టాన్ని అభినందించుకొన్నాను.

"వెళ్ళనులేవే!" ఆయన కంఠం వణుకుతూ, మెల్లగా, సిగ్గుపడుతున్నట్లు విన్పించింది.

ఆ రాత్రి చారుమతి, ఎంతో బాధపడుతూ చెప్పింది. "పాపం! ఇప్పటికీ, ఆయన నీళ్ళు ఆయనే తోడుకు పోసుకుంటాడండీ!"

నాకూ ఆ మాట వింటే బాధ కలిగింది. అంతరాంతరాళాలలో ఒక సందేహం. ఆయన నట్లా కట్టడి చేస్తున్న వాళ్ళకు, తామూ ముసలివాళ్ళమవుతామని, స్వేచ్ఛకోసం అలమటిస్తామన్న జ్ఞానం లేదా?

శీతాకాలం మనుష్యుల్ని వణికించేస్తున్నది. సూర్యుడు ఆలస్యంగా నిద్రలేచి తొందరగా పడుకొంటున్నాడు. ఓ రోజున అయిదింటికి మెలకువ వచ్చి చూస్తే, ఎదిరింట్లోనుంచి, విన్పించీ విన్పించకుండా అధ్యాత్మ రామాయణ కీర్తనలు విన్పిస్తున్నాయి. అది ముసలాయన గొంతే! సందేహం లేదు. వాకిట్లోకివచ్చి, లైటువేస్తే ఆ శతవృద్ధు ఇంటిప్రక్కన వున్న విశాల

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

మైన బయలులో పాటలు పాడుకుంటూ మొక్కలకు కుదుళ్ళు చేస్తున్నాడు – బ్యాటరీలైటు చేతబుచ్చుకుని!

ఆ వ్యక్తితో పరిచయం చేసుకు తీరాలనుకొన్నాను. ఏడుగంటలకల్లా ఆయన్ని ఆహ్వానిద్దామని ఆ ఇంటికి వెళ్ళాను.

ఓ నడివయస్సు మనిషి తలుపు తీశాడు. నన్ను లోపలకు ఆహ్వానించి ఎంతో మర్యాదచేశాడు. కాఫీ తీసుకు వస్తానని లోపలకు వెళ్ళాడు. ఇంతలోకి ఆ ముసలాయన ప్రక్కగది తలుపులు తెర్చుకుని, హాల్లోకివచ్చి, నన్నుచూసి, వెనక్కు పోబోయి, మళ్ళీఆగి, "మిమ్మల్నెక్కడో చూసినట్టుందే!" అన్నాడు ఆలోచిస్తూ.

"కాలవొడ్డున!"

నేను కొంచెం పెద్దగా అన్నానేమో, ఆ ముసలాయన ఉలిక్కిపడ్డాడు. నేను మాట పూర్తిచేయకుండానే, లోపలినుంచి ఆ నడివయస్సు మనిషి కాఫీతో ప్రవేశించాడు. ప్రవేశిస్తూనే "వెళ్ళడమే లేదన్నావుగా, కాలవకు! — ఇప్పుడు చెప్పు! ఎందుకూ ఆ అబద్ధాలు! చచ్చిపోదల్చుకుంటే, ఇంట్లోనే చచ్చిపోవచ్చుగా, కాలవలోపడి ఎందుకు, నలుగురికీ తెలవడంకోసమనా? పో. పో. గదిలోకి. ఎక్కడికీ కదలకుండా అక్కడే పడుండు."

ఆ ముసలాయన వంచిన తల ఎత్తలేదు. మెల్లగా ద్వారం పట్టుకు నిలబడి, నావేపుచూట్టానికి ప్రయత్నం చేసి, చూడలేక, తల ఆడించి, తప్పటడుగులు వేస్తూ లోపలకు వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్నప్పుడు, ఆయన కంటివెంట కారిన కన్నీటిచుక్క, నేలమీద పడి అరిపోబోయింది.

"తొంభైఏళ్ళపెద్దమనిషి. ఎప్పుడో అప్పుడు చచ్చిపోతాడు. ఎంత జాగ్రత్తగా వుండాలి." నేనేమీ సమాధానం చెప్పకపోవడం చూసి, మళ్ళీ అయన అన్నాడు. "ఆయన నాకు మామగారులెండి! పిల్లనిచ్చాడు కదండీ! అంచేత నా దగ్గరేవుంటున్నాడు; దమ్మిడీ ఆస్తి లేకపోయినా!"

"పాపం! పెద్దవాడు." అంతకన్నా ఏమనటానికీ నాకు అవకాశం లేక, పిల్లలమధ్య ఆయనను చూసిన దృశ్యాన్ని వివరించలేక, ఆ పెద్దమనిషిని లోపలకు పంపించి, నేను బయటకు వచ్చేశాను. వచ్చేస్తుండగా కిటికీ ప్రక్కనుండి, "ఏవండోయ్! ఓ సారిటురండీ." అన్నమాటవిన్పించింది. తలెత్తిచూస్తే, కిటికీ వూచల అవతల ఆయన, కిటికీకి, పూలమొక్కలకూ మధ్య నేను.

"మీరేం అనుకోకండి. వాళ్లూ చాలామంచివాళ్లు!— నామీద ప్రేమతోనే అట్లా అంటారు. వాళ్ళను అపార్థం చేసుకోకండి. ఏం?"

నేను తలవూపి ఇంటికివచ్చేశాను.

ఇంటికి రాగానే చారుమతి అడిగింది, "ఆయన్ను చూశారా?— రమ్మన్నారా? ఏవన్నాడాయన?"



"ఆయనో పెద్ద జైల్లో ఉన్నాడు" అని మాత్రం జవాబుచెప్పి, లోపలకు వెళ్ళిపోయాను. నా సమాధానం చారుమతికి సంతృప్తి నివ్వలేదని నాకు తెలుసు. ఐనా, నాకు ఆఫీసుటైము అయిపోయింది. సాయంకాలం నేను ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికి, ఎదురింటినిండా జనం. వాకిట్లో ఏడుకట్ల సవారీ తయారవుతోంది.

చారుమతి మా యింటి వరండాలో నిలబడి గ్రుడ్ల నీళ్ళు గ్రుడ్ల కుక్కుకుంటోంది.

నన్ను చూడగానే "ఆయన చచ్చిపోయినాడండీ!" అన్నది బావురుమని.

"ఎందుకని?" నా కంఠంలో తడి లేదు.

చారుమతి చాలా మెల్లగా చెప్పింది. "మధ్యాహ్నం ఒకసారి వరండాలోకి వచ్చాను—వీధిలో ఏదో కేక వినపడితేను! ఆయన మెల్లిగా, దొంగ దొంగగా తమ యింటిమెట్లు దిగుతున్నారు. పక్కనే ఎవరో పిల్లవాడున్నాడు. ప్రొద్దున్న మీరుచెప్పింది నాకు మనసులోవుండి, ఆయనతో మాట్లాడదామని, "తాతగారూ!" అంటూ బిగ్గరగా కేకవేశాను, "ఇల్లా ఒక్కసారి వచ్చిపొండి" అంటూ. ఆయన నావేపు బెదురుకళ్ళతో చూసి, నాకు నమస్కారం పెట్టూ ఆ కుర్రాణ్ణినాదగ్గరకు పంపించారు. వాడు నాదగ్గరకుపరుగెత్తుకు వచ్చి, "ఏమండీ! మా అక్కయ్యకు జబ్బుగా వుందండీ. తాతయ్యా! తాతయ్యా! అంటూ ఒకటే కలవరిస్తోంది. మాఅమ్మేమో, ఈయన్ను పిల్చుకు రమ్మంది. పిన్నిగారేమో లోపల పడుకుని నిద్రపోతున్నారు. లేస్తే మళ్ళీతాతయ్యను రానివ్వదు. అందుకని, తాతయ్య మీకు పెద్దగా అరవొద్దని నమస్కారం పెడ్తున్నాడు. తర్వాతొస్తాట్ట. పిచ్చిమొహందాన్ని, అట్లాగే చూస్తూ నుంచుండిపోయాను. ఆయన, ఆ కుర్రవాడి భుజంమీద చెయ్యివేసి, చెప్పనైనా లేకుండా వెళ్ళిపోయారు.

"నాకు తర్వాత కథ చెప్పనక్కరలేదు." అంటూ కళ్ళల్లో నీళ్ళతో, వాకిట్లోకి వచ్చేశాను. అంతకు క్రితమే ఇహలోకం వీడిన ఆ శతవృద్ధు—కూతురు, శాపాదపీ శరాదపీ మాట్లాడుతోంది, శవసంస్కారాలు ఒక చెంపన పూర్తి చేయిస్తూనే.

"నిజానికి నాకేం దుఃఖంలేదు— ఆయనట్లా అర్థాంతరపు చావు చనిపోయారే అని తప్ప. ఆయన కాబట్టి ఆ లారీక్రింద బడ్డా సరిపోయింది. అదే, ఆయన్ను తీసుకెళ్ళడానికి వచ్చిన ఆ కుర్రవాడు పడితే—మం ప్రతిష్ట ఏమైపోయేది, ఇహమేం తల ఎత్తు తిరగగలిగేవాళ్ళమా?" గోడను స్నానానికని అనించిన ఆశవం, ఆవిడ మాటలు విని నవ్వుతోంది; జనాభా లెక్కల్లోంచి ఒక్కణ్ణి తగ్గించమని నన్ను హెచ్చరిస్తోంది.

□□□